క్లుప్తంగా

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు


బూరాడ జంక్షన్ వద్ద హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయిస్తున్న ఎస్ఐ, సిబ్బంది

రేగిడి: రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటున్నామని ఎస్సై ఇ.శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని చిన్నశిర్లాం, లింగాలవలస, బూరాడ జంక్షన్ తదితర కూడళ్ల వద్ద ప్రమాద హెచ్చరిక బోర్డులను ఆదివారం ఏర్పాటు చేశారు. వాహన చోదకులు రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలని, పరిమితికి మించిన వేగంతో ప్రయాణించొద్దని, డ్రైవింగ్ చేస్తూ ఫోన్ మాట్లాడొద్దని, మద్యం తాగి వాహనాలు నడపొద్దని కోరారు. నిబంధనలు అతిక్రమించేవారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే గ్రామాల్లోకి వచ్చి బంగారానికి మెరుగులు పెడతాం, లోన్ యాప్‌ల ద్వారా రుణాలు ఇస్తామని చెబితే నమ్మి మోసపోవద్దన్నారు.

అయ్యప్పస్వాముల నిరసన ర్యాలీ


అంబేడ్కర్ జంక్షన్‌లో నిరసన తెలుపుతున్న అయ్యప్పస్వామి భక్తులు

రాజాం సిటీ: హిందువుల మనోభావాలను దెబ్బతీసే విధంగా అనుచిత వ్యాఖ్యలు చేసిన భైరి నరేష్‌ను కఠినంగా శిక్షించాలని అయ్యప్ప స్వాములు కోరారు. ఆదివారం స్థానిక పాలకొండ రోడ్డులోని అయ్యప్పస్వామి దేవాలయం నుంచి అంబేడ్కర్ జంక్షన్ వరకు నిరసన ర్యాలీ చేపట్టారు. అనంతరం మానవహారంగా ఏర్పడి భైరి నరేష్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. హిందువుల జోలికి వస్తే సహించేదిలేదని హెచ్చరించారు. కార్యక్రమంలో అఖిలభారత అయ్యప్పస్వామి సేవా సమితి జిల్లా అధ్యక్షులు పోరాపు రాము, బంకుపల్లి సత్యనారాయణశర్మ, శివ స్వామి, రాజన్న తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలిలో..


నిరసన వ్యక్తం చేస్తున్న అయ్యప్పస్వామి భక్తులు

బొబ్బిలి: తెలంగాణకు చెందిన భైరి నరేష్ అయ్యప్ప స్వామి, భక్తులను విమర్శించడాన్ని నిరసిస్తూ పట్టణానికి చెందిన పలువురు అయ్యప్ప స్వామి భక్తులు ఆదివారం నిరసన వ్యక్తం చేశారు. స్థానిక అయ్యప్ప ఆలయం వద్ద వారు మాట్లాడుతూ, విపరీత పోకడలకు పోయి హిందూ ధర్మాన్ని అగౌరవ పరచడం సరికాదన్నారు. నరేష్‌ను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

మన ఉగాదే ముద్దు..


వస్త్రపురికాలనీలో ఓ ఇంటి ముందు న్యూఇయర్ వేడుకలు వద్దంటూ వేసిన ముగ్గు

రాజాం: న్యూ ఇయర్ వేడుకల్లో భాగంగా ప్రతి ఒక్కరూ తమ ఇంటి ముందు రంగవల్లులు వేసి కొత్త సంవత్సరానికి స్వాగతం పలకడం ఆనవాయితీ. అయితే రాజాం పట్టణానికి చెందిన సేవాభారతి ట్రస్ట్ సభ్యులు తమ ఇళ్ల ముంగిట ఆంగ్ల సంవత్సరాది వద్దు.. తెలుగు సంవత్సరాదే ముద్దు అంటూ రంగవల్లులు వేసి తెలుగు సంస్కృతి, సంప్రదాయాలపై ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చే ప్రయత్నం చేశారు. విదేశీ సంస్కృతి వద్దు, స్వదేశీ సంస్కృతిని కాపాడుదాం అంటూ వేసిన ముగ్గులు రాజాంలో ఆసక్తిగా మారాయి.

ప్రతిభను వెలికితీసేందుకు పరీక్షలు దోహదం


బహుమతులు పొందిన విజేతలతో నిర్వాహకులు

రాజాం సిటీ: విద్యార్థుల్లోని ప్రతిభను వెలికితీసేందుకు మెరిట్ టెస్టులు ఎంతో దోహదపడతాయని వైఎస్సార్‌సీపీ టౌన్ కన్వీనర్ పాలవలస శ్రీనివాసరావు అన్నారు. స్థానిక ఆర్ఎస్ అకాడమి నిర్వహించిన ఉత్తరాంధ్రస్థాయి ప్రతిభా పరీక్షలో మొదటి మూడు స్థానాలు సాధించిన విద్యార్థులకు ఆదివారం బహుమతులు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటువంటి పరీక్షలతో విద్యార్థుల్లో పోటీతత్వం అలవడుతుందని, తద్వారా మేథోశక్తిని పదును పెట్టేందుకు అవకాశం ఉంటుందన్నారు. 3 నుంచి 10 తరగతుల వరకు నిర్వహించిన పరీక్షలో ప్రతి తరగతిలో ముగ్గురికి బహుమతులు అందజేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో వైద్యులు గార రవిప్రసాద్, గార సూర్యశైలజ, లెంక రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

నూతన సంవత్సరానికి ఘన స్వాగతం..

నూతన సంవత్సరాది వేడుకలు వాడవాడలా ఘనంగా జరుపుకున్నారు. శనివారం అర్ధరాత్రి 12 గంటల తర్వాత యువత కేక్‌లు కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. మహిళలు ఇళ్ల ముందు రంగురంగుల ముగ్గులు వేశారు. 2022 సంవత్సరానికి గుడ్‌బై చెబుతూ 2023 కొత్త సంవత్సరానికి స్వాగతం పలుకుతూ వేసిన రంగవల్లులు ఆకర్షణీయంగా దర్శనమిచ్చాయి. ఉద్యోగులు, ప్రజా ప్రతినిధులు, యువత ఒకరికొకరు నూతన సంవత్సర శుభాకాంక్షలు చెప్పుకుంటూ ఆదివారం సందడిగా గడిపారు.

– బొబ్బిలి/రాజాం నెట్‌వర్క్


రాజాం : వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో కార్యకర్తలతో కలిసి కొత్త సంవత్సర వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కంబాల జోగులు


బొబ్బిలి: బుడా చైర్‌పర్సన్ పార్వతి ఇంటి వద్ద వేడుకలు


రేగిడి: ఏవీపురంలో ఎంపీపీ అప్పలనరసమ్మకు శుభాకాంక్షలు తెలియజేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు


రాజాం: కొత్తవలస పాఠశాలలో రంగవల్లికల పోటీలు


రామభద్రపురం: ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావుకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఉపాధి హామీ అధికారులు


తెర్లాం: ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ, ఈఓపీఆర్‌డీలకు శుభాకాంక్షలు తెలుపుతున్న పంచాయతీ కార్యదర్శులు


మెంటాడ: ఎంపీపీ, జెడ్పీటీసీ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేస్తున్న అధికారులు, నాయకులు


బాడంగి: తహసీల్దార్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు చెబుతున్న సిబ్బంది



బొబ్బిలి రూరల్: నారాయణప్పవలస పాఠశాలలో నూతన సంవత్సర సంబరాలు

ముందే వచ్చిన పండగ..

మరో పదిహేను రోజుల్లో కనిపించాల్సిన పండగ కళ వారి ముఖాల్లో ఆదివారమే కనిపించింది. పింఛన్ సొమ్ము పెరగడంతో అవ్వా,తాతల ముఖాల్లో చిరునవ్వు వెలిసింది. జగన్ మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత అప్పటివరకున్న రూ. రెండు వేల పింఛన్ సొమ్మును మూడు వేల రూపాయల వరకు పెంచుకుంటూ పోతామని హామీ ఇచ్చిన నేపథ్యంలో ఇప్పటికే రెండు విడతల్లో రూ. 500 పెంచారు. తాజాగా మరో 250 రూపాయలు పెంచడంతో పింఛన్ మొత్తం 2,750 రూపాయలైంది. దివ్యాంగులకు ఇప్పటికే రూ. 3 వేల పింఛన్ ఇస్తుండగా.. వితంతువు, వృద్ధాప్య పింఛన్‌ను పెంచారు. ఆదివారం ఉదయం పండగ వాతావరణంలో వాడవాడాలా పింఛన్ల పంపిణీ జరిగింది. తమకు సంక్రాంతి పండగ ముందే వచ్చిందని లబ్ధిదారులు ఆనందంగా తెలియజేశారు.

– బొబ్బిలి / రాజాం నెట్‌వర్క్


రామభద్రపురం: చొక్కాపు వీధిలో పింఛన్లు పంపిణీ చేస్తున్న సచివాలయ కన్వనర్ చొక్కాపు తవిటినాయుడు,వలంటీర్లు


తెర్లాం: కూనాయవలసలో పెన్షన్లు పంపిణీ చేస్తున్న బొబ్బిలి ఏఎంసీ చైర్మన్ బొమ్మి శ్రీనివాసరావు


బాడంగి: చినభీమవరంలో కన్వీనర్ సమక్షంలో వృద్ధులకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ స్వప్న


బొబ్బిలి రూరల్: అలజంగిలో పింఛన్లు పంపిణీ చేస్తున్న సమన్వయకర్తలు, ప్రజాప్రతినిధులు


మెంటాడ: పిట్టాడలో నూతన పెన్షన్ అందజేస్తున్న ఎంపీపీ నాయుడు


బొబ్బిలి: పింఛన్లు పంపిణీ చేస్తున్న మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీ కృష్ణారావు


సంతకవిటి: శ్రీహరినాయుడుపేట పింఛన్లు పంపినీ చేస్తున్న వైస్ ఎంపీపీ గండ్రేటి కేసరి, సర్పంచ్ గండ్రేటి సురేష్, తదితరులు


రేగిడి: లచ్చన్నవలసలో వలంటీర్‌తో కలిసి పింఛన్ పంపిణీ చేస్తున్న వైస్ ఎంపీపీ టి.అచ్చెన్నాయుడు, తదితరులు

ప్రజా సంక్షేమాన్ని అడ్డుకునేందుకు టీడీపీ కుట్రలు

- వచ్చే ఎన్నికల్లో ప్రజలే ఆ పార్టీకి బుద్ధిచెప్పాలి
- కొత్త పింఛన్ల పంపిణీలో ఎమ్మెల్యే కంబాల జోగులు


రాజాం: కొత్త పింఛన్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జోగులు, తదితరులు

రాజాం: టీడీపీకి నూకలు చెల్లాయని, ఆ పార్టీ పూర్తిగా కనుమరుగయ్యే రోజులు దగ్గర్లోనే ఉన్నాయని ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద కొత్తగా పింఛన్లు మంజూరైన లబ్ధిదారులకు ఆదివారం నగదు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొత్తగా 208 మందిరి పింఛన్లు మంజూరైనట్లు చెప్పారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్నామన్నారు. ఈ నెల నుంచి పింఛను మొత్తాన్ని రూ.2750కి పెంచినట్లు చెప్పారు. వారం రోజుల పాటు పింఛన్ వారోత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజా సంక్షేమాన్ని అడ్డుకునేందుకు టీడీపీ నేతలు ఎన్నో కుతంత్రాలు పన్నుతున్నారని, వాటిని నిలువరిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ముందుకెళ్తుందని గుర్తుచేశారు. టీడీపీ అధికారంలోకి వస్తే ఈ సంక్షేమ పథకాలన్నీ కనుమరుగవుతాయని తెలిపారు. మాయమాటలు చెప్పే టీడీపీ నేతలను నమ్మొద్దని ప్రజలకు సూచించారు. టీడీపీ పూర్తిగా కనుమరుగయ్యేలా వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు తమ ఓటుతో తీర్పునివ్వాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ పాలవలస శ్రీనివాసరావు, పొట్నూరు లక్ష్మణరావు, వైస్ ఎంపీపీ యాలాల వెంకటేష్, తోట తిరుమలరావు, గొర్లె బ్రదర్స్, నల్లా శ్రీనివాసరావు, మున్సిపల్ కమిషనర్ డీటీవీ కృష్ణారావు, మేనేజర్ నాగరాజు, టీఎంసీ రత్నం, శాసపు వేణుగోపాలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ


తెర్లాం: యూటీఎఫ్ క్యాలెండర్, డైరీని ఆవిష్కరిస్తున్న ఎంఈఓ, యూటీఎఫ్ నాయకులు


రాజాం సిటీ: యూటీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎంపీపీ సులోచన, తదితరులు

తెర్లాం: మండల కేంద్రంలోని ఎంఆర్‌సీ కార్యాలయం వద్ద యూటీఎఫ్ రూపొందించిన క్యాలెండర్, డైరీలను ఆదివారం ఆవిష్కరించారు. ఎంఈఓ జె. త్రినాథరావు, యూటీఎఫ్ మండల శాఖ అధ్యక్ష, కార్యదర్శులు జి.మునిస్వామి, శంకరరావు, తదితరులు యూటీఎఫ్ సభ్యులకు వీటిని పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ ఉమాలక్ష్మి, జెడ్పీటీసీ లూర్థు, వైస్ ఎంపీపీ సత్యనారాయణ, ఎంపీడీఓ రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

రాజాం సిటీ: యూటీఎఫ్ క్యాలెండర్‌ను ఎంపీపీ లావేటి సులోచన ఆదివారం ఆవిష్కరించారు. నూతన సంవత్సర వేడుకలను పురస్కరించుకుని ఉపాధ్యాయులంతా ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉపాధ్యాయులు సమాజ నిర్దేశకులని, సమాజంలో వారికి ఎల్లప్పుడూ సముచిత స్థానం, గౌరవం ఉంటుందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రూరల్ కన్వీనర్ లావేటి రాజగోపాలనాయుడు, యూటీఎఫ్ మండలశాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మూడడ్ల శ్రీనివాసరావు, టి.అరుణ్‌కుమార్, జిల్లా కార్యదర్శి కె.బాలమురళి, ఎం.కృష్ణమూర్తి, బి.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఫార్మా మోడల్‌లో కూరగాయల సాగు

రేగిడి: మండలంలోని ఉంగరాడ యూనిట్ గుళ్ల పాడు క్లస్టర్ పరిధిలోని చాటాయవలస గ్రామంలో భవానీ స్వయంసహాయక సంఘం సభ్యులకు సంబంధించిన పది సెంట్ల భూమిలో కూరగాయల సాగుపై అవగాహన కల్పించారు. గ్రామంలో రైతులు ఫార్మా మోడల్ ద్వారా కూరగాయలను సాగు చేసేందుకు ముందుకొచ్చారు. ఆదివారం ప్రకృతి వ్యవసాయం మాస్టర్ ట్రైనీ సీహెచ్ శారద, ఎల్2 పార్వతమ్మ, గౌరీశ్వరరావు, ఐసీఆర్‌పీలు పైల తవిటినాయుడు, కూనుబిల్లి రమణ ఆధ్వర్యంలో కూరగాయలు సాగు చేసే విధానంపై రైతులకు అవగాహన కల్పించారు. 365 రోజులూ ఆకు కూరలు, తీగజాతి, మొక్కజాతి కూరగాయలను నిరంతరాయంగా పండించుకోవచ్చన్నారు. ప్రకృతి సేద్యం ద్వారా ఈ పంటలను సాగు చేసుకుంటే రైతులకు నిత్యం రాబడి ఉంటుందని వెల్లడించారు. కార్యక్రమంలో సురేష్, రవి, గోవింద్, అప్పలనాయుడు, సర్పంచ్ కరణం గోవిందరావు, రైతులు పాల్గొన్నారు.


చాటాయవలసలో ఫార్మా మోడల్ విధానంలో కూరగాయల సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్న ప్రకృతి వ్యవసాయం సిబ్బంది

దివ్యాంగ విద్యార్థులకు దుస్తుల పంపిణీ


రాజాం సిటీ: దివ్యాంగ విద్యార్థికి దుస్తులు అందజేస్తున్న కొత్తా సాయి, తదితరులు


తెర్లాం: నిరుపేదలకు దుస్తులు పంపిణీ చేస్తున్న డాక్టర్ రామకృష్ణ

రాజాం సిటీ: స్థానిక చెవిటి మూగ పాఠశాల విద్యార్థులకు రెడ్‌క్రాస్ రాజాం అధ్యక్షుడు కొత్తా సాయి ప్రశాంత్‌కుమార్ కుటుంబ సభ్యులు ఆదివారం దుస్తులు పంపిణీ చేశారు. ఏటా నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని బధిర విద్యార్థులకు కొత్త దుస్తులు అందజేస్తున్నట్లు చెప్పారు. దివ్యాంగులకు సేవ చేయడం తమకెంతో సంతృప్తినిస్తోందన్నారు. కార్యక్రమంలో కొత్తా జ్యోతి, కొత్తా సౌందర్య, పెంకి చైతన్యకుమార్, పాఠశాల కరస్పాండెంట్ ఎస్.నాగభూషణరావు తదితరులు పాల్గొన్నారు.

దుస్తుల పంపిణీ

తెర్లాం: మండల కేంద్రంలో శ్రీనివాస సేవా సంఘం ఆధ్వర్యంలో 120 మంది నిరుపేదలకు ఆదివారం దుస్తులు పంపిణీ చేశారు. శ్రీనివాస సేవా సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ కె.రామకృష్ణ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని స్థానిక ఉమారామలింగేశ్వర కల్యాణ మంటపంలో నిర్వహించారు. ప్రతి ఏటా నూతన సంవత్సరం సందర్భంగా గ్రామంలోని నిరుపేదలకు దుస్తులు పంపిణీ చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులు, వ్యాపారులు పాల్గొన్నారు.


సంక్షిప్తంగా...

పుష్పగుచ్ఛాలకు పెరిగిన డిమాండ్


రాజాంలో ఓ దుకాణం వద్ద పుష్పగుచ్ఛాలు తయారుచేస్తున్న వ్యాపారి

రాజాం: కొత్త సంవత్సర శుభాకాంక్షలు తెలిపేందుకు ఈ ఏడాది ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ బొకేలకు బదులు సహజంగా పూసిన పువ్వులతో చేసిన బొకేలను కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపారు. దీంతో పువ్వుల దుకాణాలు ఆదివారం కొనుగోలుదారులతో కిటకిటలాడుతూ కనిపించాయి. ఒక్కో పుష్పగుచ్ఛం రూ.30 నుంచి రూ.300 వరకు ధర పలికాయి.

విద్యా సామగ్రి పంపిణీ


విద్యాసామగ్రి పంపిణీ చేస్తున్న ధూపం వాసు

బొబ్బిలి రూరల్: మండలంలోని రాజచెరువువలస గిరిజన గ్రామంలో సమరసతా సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బాలవికాసకేంద్రం విద్యార్థులకు ఆదివారం నూతన సంవత్సరం సందర్భంగా విద్యాసామగ్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ డివిజనల్ కార్యదర్శి ధూపం వాసు మాట్లాడుతూ, సమాగ్రిని విద్యార్థులు సద్వినియోగం చేసునకుని బాగా చదువుకోవాలన్నారు. కార్యక్రమంలో బాలవికాస కేంద్రం మాతాజీ మొయ్యి నిర్మల, మొయ్యి వెంకటరమణ, ఫౌండేషన్ కార్యదర్శి గేదెల జనార్దనరావు, హనుమంతు కన్నయ్య, తదితరులు పాల్గొన్నారు.

ముక్కోటి ఏకాదశికి ఆలయాలు ముస్తాబు


విద్యుత్‌దీపాలతో అలంకరించిన గొర్లె సీతారాంపురం వేంకటేశ్వరాలయం

బొబ్బిలి రూరల్: ముక్కోటి ఏకాదశి పూజలకు ఆలయాలను ముస్తాబు చేశారు. మండలంలోని గొర్లెసీతారాంపురం, పిరిడి వేంకటేశ్వరాలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. సోమవారం ఉదయం ఆరు గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. వైకుంఠ ద్వారం గుండా స్వామివారిని దర్శించుకునే అవకాశం కల్పిస్తామన్నారు. పెంట, పారాది, కలువరాయి ఆలయాలలో కూడా ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు.

దరఖాస్తుల ఆహ్వానం


నోటిఫికేషన్ విడుదల చేస్తున్న ఎంపీడీఓ రమామణి

రామభద్రపురం: మండలంలో ఖాళీగా ఉన్న కొత్తరేగ, ఆరికతోట అంగన్‌వాడీ కేంద్రం–2 హెల్పర్ పోస్టులకు అర్హులైన వ్యక్తుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంపీడీఓ రమామణి తెలిపారు. ఆదివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎస్పీ మంగతాయారుతో కలిసి పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, మండలంలోని ఆరికతోట అంగన్‌వాడీ కేంద్రం–2లోని హెల్పర్ పోస్టుకు ఓసీ, కొత్తరేగ అంగన్‌వాడీ కేంద్రం హెల్పర్ పోస్టుకు ఓసీ (పీహెచ్‌సీ)కి కేటాయించినట్లు చెప్పారు. జూలై ఒకటి 2022 నాటికి 21 నుంచి 35 సంవత్సరాల్లోపు వయసు కలిగిన మహిళా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

రేపటి నుంచి నూతన పింఛన్ల పంపిణీ

బొబ్బిలి: నియోజకవర్గానికి కొత్తగా మంజూరైన పింఛన్లను మంగళవారం నుంచి పంపిణీ చేయనున్నట్లు ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల నాలుగో తేదీ నుంచి ఏడు వరకు బొబ్బిలి, తెర్లాం, బాడంగి, రామభద్రపురం మండలాల్లో పింఛన్లు అందిస్తామని పేర్కొన్నారు. వలంటీర్లు, సచివాలయ సిబ్బందితో పాటు కొత్తగా నియమితులైన సచివాలయ కన్వీనర్లు కూడా పాల్గొనాలని కోరారు.

భక్తి,శ్రద్ధలతో పూలంగి సేవ


పూలంకరణలో వేంకటేశ్వర స్వామి

బొబ్బిలి: పట్టణంలోని వెలమవారి వీధిలో గల వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం పూలంగి సేవ నిర్వహించారు. ధర్మకర్త మరిపి తిరుపతిరావు ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని వైభవంగా చేపట్టారు. అలాగే పూల్‌బాగ్‌లోని కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ధర్మకర్త గెంబలి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో తులాభారం చేపట్టారు.